


ప్రియమ్మైన శ్రీవారికి—

నేను క్షేమంగా మా యింటికి చేరాను. వెంటనే వుత్తరం వ్రాయాలనుకున్నాను గాని—వీలు చిక్కిందికాదు. వారం రోజులకి వుత్తరం వ్రాస్తున్నానని కోపం తెచ్చుకోవద్దు. నా కిక్కడ ఆనందంగా రోజులు గడచిపోతున్నాయి, నా చిన్నప్పటి స్నేహితులంతా నన్ను విడచిపెట్టకుండా కబుర్లతో కాలాన్ని కరగించేస్తున్నారు. మొన్న మా ఫ్రెండ్సుతో కలసి సినిమాకి వెళ్లాను యిప్పుడు వస్తున్న ఆదివారంనాడు పిక్నిక్ ప్రోగ్రాం వేసారు మా ఫ్రెండ్సంతా. అంతా బాగానే వుంది కాని మా అమ్మతో బాధ పడటం తప్పటంలేదు. నేను చిక్కిపోయానట. ఈ మాటను ప్రతిరోజా అంటుంది. అలా అనేసి వూరుకున్నా బాగుణ్ను. రకరకాల పిండివంటలుచేసి తినమని — పీక మొయ్యదాకా కుక్కుతుంది. వద్దన్నా వినిపించుకోదు. అటువంటి సమయంలో మీరు నా స్థానంలో వుంటే ఎంతో బాగుండేదనిపిస్తుంది నాకు భోజన ప్రియులు కాబట్టి మీకు రోజూ—చక్కని విందు భోజనం దొరికేది. యిలా వ్రాస్తున్నందులకు కోపం వచ్చిందా ? కొద్ది రోజులు వోపిక పట్టి కూర్చుంటే—ఆ తరువాత నేను వచ్చి మీ కోపం చిటికెలో పోగొడతాను. బైదిబై నా కొక్కటే దిగులుగా వుంది. పాపం ! మీరు ఎలా వండుకుని తింటున్నారో అని. హోటల్ మీల్స్ మీకు పడదు. ఈ నెల్రోజులు కాస్తంత మీరు కష్టపడాలి. ఏం చేస్తాం మరి ? వంటింటి అలమారులో కందిపొడుం డబ్బా వుంది. అది అన్నంలో కలుపుకుని తినండి. మన ఆవకాయ జాడీని నేను వచ్చేలోపల ఖాళీచేసే బాధ్యత మీది. అది మీ కోసమని నేను ప్రత్యేకంగా తయారుచేసి వుంచాను.

'ఏమండోయ్ శ్రీవారు! నేను యింట్లో లేను కదా అని మీ మిత్రులందరిని పిల్చుకొచ్చి మనింటిని పేకాట కేంద్రంగా మార్చకండి. వాళ్ళు యిల్లంతా సిగరెట్టుపీకల్తో నానా అసహ్యంగా మారుస్తారు.

నేను అక్కడకు వచ్చేవరకూ మనింటిని తుడవడానికి మన పనిపిల్ల అమ్మను రమ్మనమని చెప్పాను. అది వస్తుందా ? లేక పనిపిల్లే వస్తుందా ? ? సాయంత్రం ఆఫీసు వదలగానే మీరు తిన్నగా యింటికే వచ్చేయండి. క్లబ్బుకు వెళ్ళవద్దు. యిక్కడ నేను చాలా ఆనందంగానే వున్నాను—కాబట్టి నా గురించి మీరేమీ గాభరా చెందకండి. ఒళ్లు జాగ్రత్త. వెంటనే వుత్తరం వ్రాయడాన్ని మరచిపోకండి. యిక వుంటాను.

ఇట్లు
మీ ప్రియమ్మైన భార్య
లలిత.

# ఆషాఢమాసం

ప్రియమైన లలితకి—

నువ్వు వ్రాసిన వుత్తరం అందినది. పుట్టింటికి వెళ్ళిన వారం రోజులగ్గాని నాకు వుత్తరం వ్రాయడానికి తీరిక చిక్కలేదా? మీ ఆడవాళ్ళంతా యింతే. పుట్టింటికి వెళ్తే మొగుడి మాట మరచిపోతారు. ఈ మాటను నువ్వు అక్షరాలా రుజావుపర్చావు. అక్కడ నువ్వు పిండివంటలతో భోజనం చేస్తుంటే—యిక్కడ నేను హోటల్ మెతుకుల్ని తింటూ రోజూ ఛస్తున్నాను! నువ్వు వూరుకెళ్ళిన మర్నాడు వంట చేద్దాం కదా అని బియ్యం ఎసరు పెట్టాను. అన్నం వండి వార్చేసరికల్లా అది పేస్టులాగ తయారయింది. నాకు వంట చేతకాదు. కనుక అస్మదీయ క్షుధార్తిని నివారించుటకుగాను—మా ఆవిడను ఆశ్రయించక తప్పలేదు. [హతోస్మి! ముక్కుపుటాలు ఎగరవెయ్యకు. మా ఆవిడనగా యిక్కడ హోటలు అయ్యరు అని అర్థం. తెల్సిందా? శాంతించు.]

నా కిక్కడ యింట్లో ఏం పూసు పోవడంలేదు. రాత్రుళ్ళు అసలే నిద్ర పట్టడంలేదు. మాటి మాటికి నువ్వే గుర్తుకొస్తున్నావు నీకు అక్కడ హాయిగా వున్నా నాకిక్కడ బోర్ కొడ్తుంది. క్లబ్బుకి వెళ్ళవద్దన్నావు గాని—యింట్లో ఏం తోచక క్లబ్బుకు వెళ్తున్నాను. నువ్వు వెంటనే వచ్చేయి. ఆషాఢం లేదు—గీషాడం లేదు. అవన్నీ ముసలివాళ్ళకి వదిలేయి. నీ రాక కోసం వేయి కళ్ళతో ఎదురు చూస్తున్నాను. వెంటనే వచ్చేస్తావు కదూ!

నీ రాకకోసం ఎదురు చూస్తూ
'రాఘవేంద్ర.'

ప్రియమైన శ్రీవారికి—

మీ వుత్తరం అంది రెండువారాలయింది. యిదివరకటి కారణాలవల్లనే ఈసారి కూడా వుత్తరం వ్రాయడంలో కొంత ఆలస్యం జరిగింది. ఏమనుకోవద్దు. ఈ రోజుతో ఆషాఢం ముగుస్తుంది. కాని యింకో వారం రోజులు యిక్కడే వుండమని అమ్మ బలవంతం చేస్తుంది. కాబట్టి యిక్కడ వుండక తప్పడంలేదు. పాపం! మీరు హోటల్ భోజనం పడక ఎంత బాధ పడుతున్నారో.

యింకో విషయం. రేపు మా వదిన పుట్టింటినుండి యిక్కడికి వస్తారట. మా వదినకి నేనంటే ఎంతో ప్రేమ. నన్ను చూడగానే యింకో పదిరోజులపాటు యిక్కడినుండి కదలనేయ్యదు. నేను రావడంలో యింత ఆలస్యం జరుగుతున్నందులకు మీరు కోపం తెచ్చుకోవద్దు మీ ఆరోగ్యం జాగ్రత్త! హోటల్ భోజనంకు బదులు మరొకసారి వంట ప్రయత్నం చేసి చూడండి. వీలయినంత త్వరలో రావడానికి ప్రయత్నిస్తాను.

ఇట్లు
మీ ప్రియమైన భార్య
'లలిత.'

ప్రియమైన శ్రీమతికి,

నేను క్షేమంగానే యున్నాను. నీ వుత్తరం చూడగానే నాకు బోల్డంత కోపం వచ్చింది. చదివింతరువాత మరింత కోపం ఎక్కువయింది. నా భోజనం గురించి నువ్వేమీ బెంగపెట్టుకోనక్కర్లేదులే. నేనిప్పుడు హోటల్‌లో భోజనం మానేసాను. నాకు హోటల్ మీల్సు పడదన్న సంగతిని ఎలా తెల్సుకుందో ఏమిటో మన పక్కింటి లేడీ టైపిస్టు నువ్వు వచ్చేవరకూ తనింట్లో భోజనం చెయ్యమని ఎంతో బతిమిలాడి నన్ను వొప్పించింది. ఆవిడ వంట బాగానే వుంది. కనుక నువ్వు నా భోజనం విషయంలో ఏమాత్రం ఆందోళన చెందనవసరంలేదు. మీ వదిన ఈపాటికి వచ్చేయవచ్చును. నీ యిష్టం వచ్చినన్ని రోజులు మీ వూర్లో వుండు. నాకిక్కడ ఏం ఫర్వాలేదు నాకు కూడా హాయిగా వుంది. తాపీగానే రా. వుత్తరాలు మాత్రం మరచిపోకుండా వ్రాయి.

ఇట్లు,
'రాఘవేంద్ర'

భర్త వ్రాసిన వుత్తరాన్ని చదవగానే—చిటపటలాడుతూ తన బట్టల నన్నింటిని లలిత సూటుకేసులో సర్దసాగింది. ఇంకో పదిరోజులపాటు వుంటుందనుకున్న లలిత యిలా అకస్మాత్తుగా ప్రయాణ సన్నాహం గావించడం చూసి విస్తుపోయింది లలిత వదిన.

బట్టలు సర్దుకున్న తరువాత లలిత రామారావు దగ్గరకువెళ్ళి 'అన్నయ్యా! నేను సాయంత్రం మెయిలుకి బయల్దేరుతున్నట్లుగా మా వారికి టెలిగ్రాం యివ్వరా!!' అంది. చెల్లెలు ముఖంలోకి విచిత్రంగా చూసాడు రామారావు.

